మాదిగలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డి

- ఒకే కుటుంబానికి మూడు సీట్లు.. కుటుంబ పాలన కాదా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై వంగపల్లి శ్రీనివాస్ మాదిగ విమర్శలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్, మార్చి 20: ఎస్సీ డిక్లరేషన్ అంటూ ఎన్నికల ముందు కల్లబొల్లి హామీలు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసెత్తకుండా మాదిగలను మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆరోపించారు. కుటుంబ పాలనను అంతం చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పార్లమెంట్ సీటును వెంకటస్వామి కుటుంబానికి ఇచ్చి కుటుంబ పాలనను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా పెద్దపల్లి ఎంపీ సీటు మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాదిగ మాట్లాడారు. తెలంగాణలో అధిక జనాభా కలిగిన మాదిగలకు రెండు ఎంపీ సీట్లు ఇవ్వకపోతే పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని హెచ్చరించారు. మాదిగ, ఉపకులాలు ఏకమై మోసపూరిత వైఖరి అవలంబిస్తున్న కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను, దళిత మంత్రులను బహిరంగంగా అవమానిస్తున్నదని మండిపడ్డారు. బీసీలు, దళితులను రేవంత్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తున్నదని తూర్పారబట్టారు. ఇందిరమ్మ రాజ్యస్థాపన అంటే దళితులను అణగదొక్కడమేనా అని ఎద్దేవా చేశారు. దళితులపై ఏమాత్రం ప్రేమ ఉన్నా మిగతా సీట్లను మాదిగలకు కేటాయించాలని, లేని పక్షంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించి కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామంటూ రేవంత్‌రెడ్డి చెప్పిన దళిత డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించిన కాంగ్రెస్ ప్రభుత్వం 17 మంది అగ్రవర్ణాల వారికే ప్రాధాన్యతమిచ్చిందని, మాదిగలకు ఒకే ఒక్క చైర్మన్ పదవి ఇచ్చి తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు.

తహసీల్దార్‌పై పెట్రోలు చల్లి.. వారూ పోసుకొని!

- భూసమస్య పరిష్కరించాలని బాధితుల ఆత్మహత్యాయత్నం
- గద్వాల జిల్లా అయిజ తహసీల్దార్ కార్యాలయంలో ఘటన
- పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు.. విచారిస్తున్న ఎస్సై

అయిజ, మార్చి 20: భూమి సమస్యను పరిష్కరించాలని ఐదుగురు బాధితులు తాసీల్దార్‌పై పెట్రోలు చల్లి.. తమపైనా పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బుధవారం జరిగిన ఈ భయానక ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ తాసీల్దార్ కార్యాలయంలో కలకలం రేపింది. అయిజ పట్టణానికి చెందిన రంగు రామేశ్వరమ్మ, సుభద్రమ్మ, గోవిందమ్మ, లక్ష్మీదేవి, రోహిణమ్మలు.. అయిజ మండలం బింగిదొడ్డి శివారులోని సర్వే నంబర్ 139లో ఉన్న భూమి సమస్యను పరిష్కరించాలని తాసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. ఆ సర్వే నంబర్‌లో ఉన్నది ప్రభుత్వ భూమి అని, అందులో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని తాసీల్దార్ రైతుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా వినిపించుకోకుండా ఆ సర్వే నంబర్‌లో ఉన్న పదెకరాల భూమిని తమ పేరిట నమోదు చేయాలని పట్టుబట్టారు. గతంలో ఏం జరిగిందో తనకు తెలియదని, 15 రోజుల కిందటే ఇక్కడికి వచ్చానని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తాసీల్దార్ వారికి నచ్చజెప్పారు. ఈ క్రమంలో కోపోద్రిక్తులైన బాధితులు.. తమ వెంట బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్‌ను తాసీల్దార్‌పై చల్లడంతోపాటు తమపైనా పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు.అప్రమత్తమైన కార్యాలయ సిబ్బంది, ప్రజలు వారిని అడ్డుకుని పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సమాచారం అందుకున్న ఎస్సై విజయ్ భాస్కర్ బాధితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాసీల్దార్ జ్యోతి ఫిర్యాదు మేరకు బాధితులను విచారిస్తున్నట్టు ఎస్సై తెలిపారు. ఈ విషయాన్ని కలెక్టర్ సంతోష్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు తాసీల్దార్ పేర్కొన్నారు.

నాడు కళ కళ ..

బీఆర్ఎస్ సర్కార్ కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీటితో నిరుడు మార్చి నెలలో దిగువ మానేరు జలాశయం కళకళలాడింది. ఇతర జిల్లాలకు తాగు, సాగు నీరందించింది. జూన్ నెల వరకు కూడా రిజర్వాయర్‌లో నీరు నిలువ ఉన్నది. యాసంగి వరిసాగుకు ఆయకట్టు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరందించింది.

నేడు వెలవెల

ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ ఎస్సారెస్పీ నుంచి నీరు విడుదల చేయకపోవడం, కాళేశ్వరం నుంచి నీరు రాక పోవడంతో మధ్యలోనే రిజర్వాయర్ ఖాళీ అయింది. ఉన్న నీటిని యాసంగి పంటల కోసం విడుదల చేస్తుండగా, మరికొద్దిరోజుల్లో డెడ్‌స్టోరేజీకి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందే అవకాశాలు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం కనిపిస్తున్నది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్

కాంగ్రెస్‌కు ఆటోడ్రైవర్ల ఉసురు తాకుతది

- పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధిచెప్తాం
- బీఆర్టీయూ ఆధ్వర్యంలో హక్కులు సాధిద్దాం

చిక్కడపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్టీయూ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో/చిక్కడపల్లి, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని బీఆర్టీయూ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు పథకం ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 40 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆ ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు కాంగ్రెస్ పార్టీకి తప్పకుండా తగులుతుందని అన్నారు. చిక్కడపల్లిలోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. తాజాగా మలక్‌పేటలో రమేశ్ అనే ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు ఒక్క తాటిపైకి వచ్చి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ బుద్ధిచెప్తామని హెచ్చరించారు. బీఆర్టీయూ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి మన హక్కులు మనం సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆత్మహత్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు.

ఆటో డ్రైవర్ రమేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రభుత్వానికి మృతుడి భార్య, బస్తీవాసుల డిమాండ్

ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ రాత్లావత్ రమేశ్ (ఫైల్ ఫొటో)

మలక్‌పేట, మార్చి 20: ఫైనాన్సర్లు ఆటోను లాక్కెళ్లటంతో ఉపాధిని కోల్పోయి, కుటుంబ పోషణ భారమై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ రాత్లావత్ రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మృతుడి భార్య ప్రియ, బస్తీవాసులు డిమాండ్‌చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన తమ కుటుంబం రోడ్డున పడిందని, తల్లిదండ్రులు ఇద్దరు మరణించటంతో అనాథలైన ఇద్దరు ఆడ పిల్లలను పోషించటం తనకు భారంగా మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు చిన్నారులు ఎల్‌కేజీ, నర్సరీ చదువుతున్నారని, ఏడు నెలల క్రితం వచ్చిన తాను బయటి ప్రపంచం ఎరుగనని, ఇలాంటి పరిస్థితుల్లో వారిని ఎలా పోషించేదని కన్నీటి పర్యంతమయ్యారు. అత్యంత దీన స్థితిలో కొట్టుమిట్టాడుతున్న రమేశ్ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని బస్తీనాయకుడు నేనావత్ అనిల్ విజ్ఞప్తి చేశారు. ఇద్దరు చిన్నారుల చదువులకు, వారి భవిష్యత్తుకు అండగా నిలిచేలా ఆర్థికంగా సాయంచేసి ఆదుకోవాలని కోరారు.

మాదిగలకు కాంగ్రెస్‌లో అన్యాయం

మొదటిపేజీ తరువాయి...

కులానికి చెందిన తానే నాగర్‌కర్నూల్ స్థానానికి అన్ని అంశాల్లో అర్హత కలిగిన, గెలవగల అభ్యర్థినని వివరించారు. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 17,30,781 మంది కాగా అందులో మాదిగ ఓటర్లు 3,75,532, మాల ఓటర్లు 62,801 మంది ఉన్నారని వివరించారు. ఖమ్మం నాయకులు, ఏఐసీసీ నాయకులు కలిసి వాస్తవాలను అణచిపెట్టి, అదే నియోజకవర్గంలో నాలుగుసార్లు ఓడిపోయిన, మాల కులానికి చెందిన మల్లు రవి పేరును ఖరారు చేశారని, హార్డ్‌కోర్ కార్యకర్తనైన తనకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మల్లు రవికి ఇదివరకే ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా క్యాబినెట్ హోదా కల్పించారని గుర్తుచేశారు. తాను ఇన్‌చార్జి సెక్రటరీగా మహారాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశాల్లో బిజీగా ఉన్న సమయంలో మల్లు రవి పేరును సీఈసీకి ప్రతిపాదించారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో దళితులపై దాడులు

తెలంగాణలో కాంగ్రెస్ నేతలు రెచ్చిపోతున్నారు. కన్నుమిన్ను కానక కండకావరం చూపుతున్నారు. దళితులపై ఎక్కడికక్కడ దాడులకు తెగబడుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అండ చూసుకుని గ్రామాల్లో చిన్న చిన్న నాయకులు సైతం చెలరేగిపోతున్నారని విపక్షాలు, దళిత సంఘాలు ఆరోపిస్తున్నాయి. తాజాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో దళితులైన తండ్రీకొడుకులపై కాంగ్రెస్ జడ్పీటీసీ భర్త కులం పేరుతో దూషిస్తూ భౌతిక దాడులకు దిగితే.. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త కార్మికులపై కర్రలతో దాడి చేశాడు.

మెట్‌పల్లిలో కాంగ్రెస్ జడ్పీటీసీ భర్త దాష్టీకం

- కులం పేరుతో దూషిస్తూ తండ్రీకొడుకులపై దాడి
- అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నిరసన
- మహబూబ్‌నగర్‌లో కాంట్రాక్ట్ కార్మికులపై దౌర్జన్యం
- కర్రలతో చితకబాదిన కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త

మెట్‌పల్లి, మార్చి 20: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో దళిత కుటుంబానికి చెందిన తండ్రి, కొడుకుపై అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, స్థానిక జడ్పీటీసీ రాధ భర్త కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి దౌర్జన్యానికి దిగాడు. దళితుడైన గొర్రె రంజిత్, అతని తండ్రి మల్లేశంను కులం పేరుతో దూషిస్తూ దాడికి తెగబడటం స్థానికంగా కలకలం రేపింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్‌లోని మల్లన్న స్వామి ఆలయ సమీపంలో హోటల్ వద్దకు టీ తాగేందుకు రంజిత్ వెళ్లాడు. అదే సమయంలో అక్కడ మల్లన్నస్వామి ఆలయ ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా మ్యాదరి కార్తీక్ తన ట్రాక్టర్‌తో చేయించిన పనులకు సంబంధించి డబ్బుల విషయమై ఆలయ కమిటీ చైర్మన్ ముదాం రమేశ్‌ను అడుగుతున్నాడు. రమేశ్ కార్తీక్‌తో ఉన్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించి రంజిత్‌కు చెబుతుండగా.. అక్కడికి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డి కల్పించుకుని కులం పేరు పెట్టి పరుష పదజాలంతో దూషిస్తూ రంజిత్‌పై చెప్పుతో దాడి చేశాడు. దీంతో రంజిత్ తన తండ్రి మల్లేశంతో కలిసి జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కోరుట్లకు వెళ్లాడు. తిరిగి గ్రామానికి వచ్చాక తమ వెంబడి వచ్చిన మరొకరిని ఇంటివద్ద దింపేందుకు మోటర్ సైకిల్ వెళ్తున్న మల్లేశంను శ్రీనివాస్‌రెడ్డి, అతని కొడుకు శ్రీకర్, తల్లి రామవ్వ అడ్డుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తారా? అంటూ విచక్షణ కోల్పోయి దాడికి దిగారు. ఈ ఘటనలో మల్లేశం తల పగలడంతోపాటు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, అంబేద్కర్ సంఘాల నాయకులు బాధితులకు అండగా నిలిచారు. జడ్పీటీసీ భర్త శ్రీనివాస్‌రెడ్డి తీరుపై మండిపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటనపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులతో కలిసి వారు స్వయంగా మెట్‌పల్లి సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయానికి వెళ్లి దళితులపై జరుగుతున్న దాడులను వెంటనే అరికట్టాలని, నిందితులను శిక్షించాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో అరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ‘మనుషుల పేగులు మెడలో వేసుకుని తిరుగుతా, పండబెట్టి తొక్కుతా’ అని వాళ్ల నాయకుడు రేవంత్‌రెడ్డి అంటే.. అదే బాటలో వాళ్ల కార్యకర్తలు నడుస్తున్నారని విమర్శించారు. దాడుల సంస్కృతి మంచిది కాదని, పదవులు, అధికారం శాశ్వతం కాదు అనే విషయం గ్రహించాలని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి కుల అహంకారాన్ని తగ్గించుకుని అణగారిన వర్గాలకు రక్షణ కల్పించాలని కోరారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యకర్తలపై, ప్రజలపై దాడులను సహించేది లేదని తేల్చి చెప్పారు. దళిత బిడ్డలపై దాడులకు తెగబడటం హేయమైన చర్య అని, పెద్దాపూర్‌ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు మద్దతుగా ఎంపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్, అంబేద్కర్ సంఘాల నాయకులు నిలిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు జడ్పీటీసీ భర్తపై కేసు నమోదు చేసినట్టు కోరుట్ల ఎస్సై కిరణ్ తెలిపారు. కాగా మెట్‌పల్లిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి చేతిలో తీవ్రంగా గాయపడ్డ గొర్రె మల్లేశం

కార్మికులపై కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త దాడి

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మార్చి 20 : మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులపై కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త దాడి చేసిన ఘటన మహబూబ్‌నగర్ బల్దియాలో చోటు చేసుకున్నది. బాధితుల కథనం మేరకు.. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ 17వ వార్డులోని ఎర్రవెల్లి తండాలో ఎల్‌ఈడీ లైట్లను వేసేందుకు కార్మికులు మోసిన్, చిన్నా వెళ్లారు. అయితే, చాలా రోజులుగా లైట్లు ఎందుకు వేయలేదని కాలనీవాసులు కార్మికులను అడగగా.. మున్సిపాలిటీ నుంచి వస్తేనే తాము వేస్తామని చెప్పారు. ఈ విషయాన్ని కాలనీవాసులు కౌన్సిలర్‌కు చెప్పగా.. కాంగ్రెస్ కౌన్సిలర్ జంగమ్మ భర్త పాపారాయుడు ఆవేశంగా వచ్చి కార్మికులను అసభ్య పదజాలంతో దూషిస్తూ కార్మికులపై కర్రలతో దాడిచేశారు. గాయాలపాలైన కార్మికులు రూరల్ ఎస్సై విజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం క్షతగాత్రులను పోలీసులు ప్రభుత్వ జిల్లా దవాఖానకు చికిత్స కోసం తరలించారు. కాంగ్రెస్ కౌన్సిలర్ భర్తపై కేసు నమోదు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు.

మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని రద్దుచేయాలి

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్లకు గిరాకీ లేక ఉపాధి కోల్పోతున్నారని తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉచిత బస్సు పథకాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జనగామ జిల్లా దేవరుప్పులలో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

తారస్థాయికి కాంగ్రెస్ వర్గపోరు

- అధ్యక్ష పదవి మార్పుతో భగ్గుమన్న విభేదాలు
- దేవరుప్పలలో పెద్ది వర్గం ధర్నా
- కాంగ్రెస్ కార్యాలయంపై దాడి

దేవరుప్పుల, మార్చి 20: జనగామ జిల్లా దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు తారాస్థాయికి చేరింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి మార్పుతో విభేదాలు భగ్గుమన్నాయి. చాలా కాలంగా లోలోపల ఉన్న గ్రూపు తగాదాలు అధ్యక్షుడి మార్పుతో బహిర్గత మయ్యాయి. రెండేండ్లుగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఉన్న దేవరుప్పుల గ్రామానికి చెందిన పెద్ది కృష్ణమూర్తిని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి మంగళవారం బాధ్యతల నుంచి తప్పించి.. నీర్మాల గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్‌ను నియమించారు. పెద్ది కృష్ణమూర్తి ఒంటెద్దు పోకడలు, కార్యకర్తలు, నాయకులకు సమాచారం ఇవ్వడం లేదన్న ఫిర్యాదుల మేరకు ఝాన్సీరెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. పలుమార్లు పెద్ది కృష్ణమూర్తిని పద్ధతి మార్చుకోవాలని ఝాన్సీరెడ్డి తెలిపినా ఆయన పట్టించుకోకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో ఝాన్సీరెడ్డి మంగళవారం తొర్రూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్ది కృష్ణమూర్తిని తొలగించి ఆ స్థానంలో నల్ల శ్రీరామ్‌ను మండల అధ్యక్షుడిగా ప్రకటించి సన్మానించారు. ఈ నిర్ణయంతో పెద్ది వర్గీయులు బుధవారం దేవరుప్పుల మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఆయన తొలగింపు అప్రజాస్వామికమని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. అంతటితో ఆగకుండా.. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంపై దాడి చేశారు. ఆఫీసులో ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. పోలీసుల రంగప్రవేశంతో గొడవ సద్దుమణిగింది. పోలీసులు కాంగ్రెస్ కార్యాలయ షట్టర్లు కిందికి దించి కాపలా ఏర్పాటు చేశారు.

చిన్నపీట చిచ్చు

మొదటిపేజీ తరువాయి...

విరుచుకుపడ్డారు. ఇది కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి పెద్దమరకగా మిగిలే ప్రమాదం ఉండటంతో ఆ మరునాడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా స్పందించి నష్టనివారణకు యత్నించారు. ఈ ఘటనపై తన సన్నిహితుల వద్ద భట్టి విక్రమార్క కుతకుతలాడినప్పటికీ, బయటికి మాత్రం దీనిని టీక ప్పులో తుఫానుగా కొట్టిపారేస్తూ వివాదం సమిసిపోయిందన్నట్టుగా నమ్మించే ప్రయత్నం చేశారు. కానీ పార్టీ అంతర్గత వేదికలపై మాత్రం తనకు జరిగిన అవమానం కాకతాళీయంగా జరిగింది కాదని, ఉద్దేశపూర్వకమేనని భట్టి ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. పార్టీ పెద్దలు మల్లికార్జునఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ దృష్టికి తన కుటుంబ సభ్యుల ద్వారా లిఖితపూర్వకంగా తీసికెళ్లి ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా పార్లమెంట్ అభ్యర్థుల ఖరారుపై ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డిని పార్టీ అగ్రనాయకులు ఈ అంశంపై ఆరా తీసారంటే.. కాంగ్రెస్ అధిష్ఠానం ఈ వివాదాన్ని ఎంత సీరియస్‌గా తీసుకున్నదో తెలుస్తున్నది.

గవర్నర్ ప్రమాణానికి గైర్హాజర్?

రాష్ట్ర గవర్నర్‌గా రాధాకృష్ణన్ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనతో రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌పాటు మంత్రులంతా హాజరైనప్పటికీ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గైర్హాజర్ కావడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మధ్య కాలంలో తనకు ఎదురైన అవమానాల వల్లనే ఆయన గైర్హాజర్ అయ్యాండాన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే భట్టి విక్రమార్క సన్నిహితులేమో ‘అలాంటిదేమీ లేదు.. ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశానికి వెళ్లిన భట్టి అక్కడే ఉండిపోవడం వల్ల రాలేకపోయారు’ అని చెప్తున్నారు. ఎన్నికల కమిటీ సమావేశం తిరిగి గురువారం ఉండటం వల్ల ఢిల్లీలోనే ఉండిపోయారని అంటున్నారు. ఈ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, ఎన్నికల కమిటీ సభ్యుడు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా హాజరు కావాల్సి ఉన్నది. అయినప్పటికీ వారు గవర్నర్ ప్రమాణ స్వీకారానికి వచ్చినప్పుడు డిప్యూటీ సీఎం భట్టి ఎందుకు రాలేదని మరికొందరు ప్రశ్నిస్తున్నారు. ఖమ్మం ఎంపీ టికెట్ భట్టి తన భార్యకు ఇప్పించుకునేందుకు లాబీయింగ్ చేయడంలో బిజీగా ఉండటం వల్లనే గవర్నర్ ప్రమాణానికి రాకపోవడానికి కారణంగా కాంగ్రెస్‌లోని ఒక వర్గం నాయకులు చెబుతున్నప్పటికీ.. అది నిజం కాకపోవచ్చునని మరికొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు.

ప్రకటనలో భట్టి ఫోటో మాయం

ఒకవైపు ప్రభుత్వ ప్రకటనలలో సీఎం రేవంత్‌రెడ్డి ఫొటో ఒక్కటే ముద్రించడంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అప్పటికే గుర్రుగా ఉన్నారు. దీనికి యాదగిరిగుట్టలో చిన్న పీట వివాదం అగ్నికి ఆజ్యం పోసినట్టు అయ్యింది. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైనప్పటినుంచే పార్టీలో ఆయన ఆధిపత్య ధోరణి సీనియర్ నేతలను నొచ్చుకునేలా చేసింది. అయితే పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావాలన్న ఏకైక లక్ష్యంతో వారంతా ఆయనకు సహకరిస్తూ వచ్చారు. అనూహ్యంగా పార్టీ అధికారంలోకి రావడంతో.. అధిష్ఠానం భట్టి, ఉత్తమ్, కోమటిరెడ్డి వంటి సీనియర్లను ఒప్పించి సీఎం సీట్లో రేవంత్‌ను కూర్చోబెట్టింది. అయినప్పటికీ సీనియర్లు సర్దుకుపోయే ప్రయత్నం చేశారు. ఒకవిధంగా చెప్పాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి తన పాదయాత్రనే దోహదం చేసిందని భట్టి విక్రమార్క అనేక సందర్భాలలో, పార్టీ అంతర్గత వేదికలపై గుర్తుచేస్తూనే ఉన్నారు. సీఎం సీట్లో కూర్చోవాల్సిన తాను డిప్యూటీ సీఎం పోస్టుతో సరిపెట్టుకున్నప్పటికీ.. తనను అవమానించేలా, తన స్థాయిని తగ్గించేలా తనపట్ల చులకనభావాన్ని ప్రదర్శిస్తున్నారని భట్టి విక్రమార్క సన్నిహితుల వద్ద వాపోతున్నట్టు సమాచారం.

‘ఆత్మ’గా ఆ అడ్వైజర్!

- పాలనలో ఆయనదే హల్‌చల్!
- కేవీపీతో పోల్చుతున్నవైనం
- ఇంటికి క్యూ కడుతున్న బడా నేతలు, దళారులు, ఉన్నతాధికారులు

హైదరాబాద్, మార్చి 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని ఒక అడ్వైజర్ ‘ఆత్మ’గా చెలామని అవుతున్నారా? నాడు కేవీపీ పోషించిన పాత్రను ఇప్పుడు ఈ అడ్వైజర్ పోషిస్తున్నట్టు భావిస్తున్నారా? అంటే అవుననే అభిప్రాయాలే వినిపిస్తున్నాయి. పాలనాపరమైన వ్యవహారాల్లో సదరు సలహాదారు మంత్రులను మించి హల్‌చల్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తున్నది. ఏదైనా పని కావాలంటే.. సలహాదారును కలిశావా? అనే స్థాయికి పరిస్థితి చేరింది. ప్రభుత్వంలో కీలక వ్యక్తికి అత్యంత సన్నిహితుడు కావడంతో సొంత పార్టీ నేతలతోపాటు ఇతర పార్టీల నేతలు, ఉన్నతాధికారులు సైతం ఆయన ఇంటికి క్యూ కడుతున్నారు. రాజకీయ నేతలు టికెట్లు, పదవుల కోసం పైరవీలు చేస్తుంటే, అధికారులు బదిలీలు, పోస్టింగ్‌ల కోసం పైరవీలు చేస్తున్నారనే చర్చ జరుగుతున్నది. ప్రభుత్వంలోని కీలక వ్యక్తి అపాయింట్‌మెంట్ కావాలంటే ముందు గా ఆ అడ్వైజర్‌ను కలవాల్సిందేనని చెప్పుకుంటున్నారు. ప్రభుత్వంలోని కీలక వ్యక్తితో ఏదైనా పర్సనల్‌గా మాట్లాడాలనుకుం